

పరాంకుశం చాల సేపట్నుంచి టి. సి. ని బ్రతిమాలుతున్నాడు. రూపాయిలుకూడా ఆశచూపించాడు. తనంతటివాడు టి. సి.ని అలా ప్రాధేయపడుతూ అడగటం అవమానంగానే వుంది. కాని తప్పదు. అవసరం తనది. వసుదేవుడంతటివాడు ....అని ఓదార్చుకున్నాడు.

"సారీ సర్....ఒక్క బెర్తు కూడ ఖాళీగా లేదు. విజయవాడలో కనిపించండి. ఖాళీ అయిపోతే మీకు తప్పకుండా యిస్తాను." టి. సి. ముందుకు వెళ్ళిపోయాడు.

రైలు కూత వేసింది. పరాంకుశం అయిష్టంగా హడావిడిగా ప్రక్కనున్న రెండవ తరగతిలోకి ఎక్కాడు. బాక్స్ తిరునాళ్ళగా వుంది. మంత్రిగారి వూరేగింపులా వుంది. జనం- జనం! కనీసం పరాంకుశానికి విశాలంగా నిలబడే స్థలం కూడా దొరకలేదు.

రైలు వేగం అందుకుంది.

ప్లిమత్ సర్వీస్ కిచ్చాక హైద్రాబాద్ ప్రయాణం తగిలింది. పరాంకుశానికి విలాసమైన ప్రయాణాలు అలవాటు. ఈనాడు సామాన్యుడిలా అవస్థపడుతూ ప్రయాణం చెయ్యవల్సి వచ్చినందుకు తిట్టుకున్నాడు.

సిగరెట్ కాల్చడానికి కూడ సందు లేదు. పరాంకుశానికి డోర్ దగ్గర ఎర్ర సంచీతో నిలబడిన గడ్డం ఆసామీ మీద దృష్టి నిలిచింది. ఎవరు చెప్మా?

నమఃశివాయ కదూ! కాని పలకరించడానికి నామోషీ కలిగింది. తనెందుకు పలకరించాలి? అతడి అవసరం తనకేమిటి?

నమఃశివాయ జనాన్ని దాటుకుంటూ, తన్నుకుంటూ, తిట్లు తింటూ అతడి దగ్గరికి వచ్చాడు. "బాగున్నావా పరాంకుశం?"

పరాంకుశం బాల్యస్నేహితుడ్ని చూసి మూల్గాడు. తన కంటె క్రిందిస్థాయి మనుషులతో మాట్లాడడానికి అతడికి సిగ్గుగా వుంటుంది. వెలపరంగా వుంటుంది.

ఈ పెట్టెలో తనని చూచి .... చితికిపోయాడనుకుంటాడేమో- అని అనుమాన మొచ్చి "ఫస్టక్లాస్ దొరక లేదు" అన్నాడు సంజాయిషీగా.

"అది నా అదృష్టం."

"ఏం?"

"లేకపోతే నీతో మాట్లాడటం కుదురుతుందా?"

ఏదో స్టేషన్‌లో రైలు ఆగింది. మరింత మంది ఎక్కి వారిని ముందుకు గెంటారు. పరాంకుశం నసుగుతూనే వున్నాడు- 'వెధవజనమంటూ.'

"మా బాధలు నీకు తెలియడం మంచిదే పరాంకుశం."

"మీ కోసం నేను బాధలు పడాలా? .... వెధవ జెలసీ .... బాగున్నవాడిని చూడగానే మీకు కళ్ళుకుడతాయి. అంతా మీలాగే తయారవ్వాలనుకుంటారు."

నమఃశివాయగడ్డం రాసుకుంటూ మందహాసం చేశాడు.

పరాంకుశం,నమఃశివాయఒకటో తరగతి నుంచి, పదకొండో తరగతి వరకూ కలిసి చదువుకున్నారు.

(మిగతా కథ 65 వ పేజీలో చూడండి)

('శంఖుతీర్థం' .... 32 వ పేజీ తరువాయి)

పరాంకుశం పదకొండు తప్పాడు. నమఃశివాయ పాసయి కాలేజీలో చేరి డిగ్రీ అందుకుని గుమాస్తా అయ్యాడు. పరాంకుశం తనకు చదువు రానందుకు ఏం బాధ పడలేదు. తను నాయకుడి కొడుకు. తనూ నాయకుడే. తండ్రి దగ్గర ఓనమాలు నేర్చుకుని రాజకీయాల్లో మెట్లు ఎక్కసాగేడు. రేసు గుర్రంలా ఉంది ప్రగతి.

"నీ గురించి రోజూ పేపర్లో చూస్తూంటాను. నా స్నేహితుడని అందరికీ చెబుతాను."

'అది నీ అదృష్టం సుమా' అన్నట్లు పరాంకుశం నవ్వాడు. ఏలూరులో ఆగింది రైలు. సాధువు దిగుతూ తన సీటు నమఃశివాయకి ఆఫర్ చేశాడు. అది చూసి పరాంకుశానికి మండి పోయింది. వీడి ముందు యిక నిలబడి మాట్లాడాలా?

"నిలబడి ప్రయాణం చేయడం నాకు అలవాటే.... నువ్వు కూర్చో పరాంకుశం."

పరాంకుశం దర్జాగా కూర్చుని 555 సిగరెట్ వెలిగించాడు. కూర్చోవడంతో అలసట తగ్గి సుఖంగా వుంది. "ఏం చేస్తున్నట్లు?" కాలక్షేపంగా అడిగాడు.

"దాస్ అండ్ దాస్ కంపెనీలో కాషియరుగా వుండేవాడ్ని. ఈ మధ్య ఆ కంపెనీ మూసివేశారు. వాళ్ళు హైద్రాబాద్‌లో వున్న మరో కంపెనీకి సిఫారుసు చేశారు."

"దివాళా తీసే కంపెనీ మాట ఎవరు వింటారు?"

"నీ కంపెనీలో ఏదయినా చూడలేవూ?"

"సారీ....ఖాళీలులేవు...."కటువుగా అన్నాడు. నోరు తెరచి అలా అడగటం అసహ్యంగా వుంది. సీటు యిచ్చినందుకు ప్రతిఫలం-వుద్యోగం!

తర్వాత పరాంకుశం యిక మాట్లాడలేదు. నమఃశివాయ పల్కరించినా "నన్ను డిస్టర్బ్‌చెయ్యకు" అని కసురుకున్నాడు.

విజయవాడలో రైలు ఆగింది. పరాంకుశం దిగ బోతూండగా

శివాయ వెంటపడ్డాడు. ఎందు కన్నట్లు చూశాడు.

"డబ్బు తక్కువగా వుంది. ఉద్యోగం రాగానే నీకు పువ్వుల్లో పెట్టి యిస్తాను." నమఃశివాయ తడుముకుంటూ అన్నాడు.

"నీ లాంటి వాడికి జన్మల్లా డబ్బు కక్కుర్తే. బాకీలు తీరుస్తారా మీరు? మీ జీవితాలు అప్పులతోనే తెల్లవారుతాయి. అయినా నేను రూపాయలు పండించడం లేదు, నీలాంటి వాళ్ళందరికీ అప్పులు యివ్వడానికి." పరాంకుశం కదిలాడు.

నమఃశివాయ నిర్ఘాంతపోయాడు.

* * *

పరాంకుశం హోటల్‌కి తిరిగి వచ్చేసరికి ఒకటిన్నర యింది. ఎండలో తిరిగి రావడం వల్ల అలసటగా వుంది. బెల్ నొక్కి.... కూల్ డ్రింక్స్ ఆర్డరిచ్చాడు.

బేరర్ డ్రింక్ తెచ్చి "సార్! భోజనం తెమ్మంటారా?" అన్నాడు.

"వద్దు .... డైనింగ్ హాల్‌కి వస్తాను."

ముఖం కడుక్కుని లుంగీతో క్రిందికి బయలుదేరాడు.

ఏసి రెస్టారెంటు రష్‌గా వుంది. కుర్చీలు ఖాళీగాలేవు. డిమ్మర్స్‌లో తడుముకుంటూ పరాంకుశం ఒక చోట కూర్చున్నాడు.

"హలో!"

పరాంకుశం తలఎత్తిచూశాడు.

అతడు వచ్చి పరాంకుశం టేబిల్ ముందు కూర్చున్నాడు, సుమారుగా నలభై వుంటాయి. వుంగరాలతో వేళ్ళు మెరిసి పోతున్నాయి. ఖరీదైన వాలకం కనిపిస్తోంది. ఎక్కడ చూశాను చెప్మా....పరాంకుశం వితర్కించుకున్నాడు. అయినా గుర్తురాలేదు.

"నేను నమఃశివాయని....గుర్తుపట్టలేదా?"

పరాంకుశం వుబ్బి తబ్బిబ్బయ్యాడు. "నిన్న రైల్లో ...."

"హాపీక్లబ్ వార్షికోత్సవం సందర్భంగా ఫాన్సీ డ్రెస్ వేషం

వేశాను. బట్టలు మార్చుకునే వ్యవధి లేదు. అలాగే రైలు ఎక్కేశాను. నువ్వు కనిపించావు."

పరాంకుశం వెర్రిగా నవ్వాడు. భోజనంయథాలాపంగాచేస్తున్నాడు. నమఃశివాయ తను ఆశించినట్లుచిన్న మనిషి కాదు. తను ఎరక్క చిన్న చూపు చూశాడు.

నమఃశివాయ తన గురించి చెబుతూంటే పరాంకుశం ఆశ్చర్యంగా విన్నాడు. నమఃశివాయ పెద్ద బిజినెస్ మాగ్నెట్. ఎన్నో కంపెనీలకి యం.డి.

నమఃశివాయ వద్దన్నా వినకుండా, పరాంకుశం బిల్లు చెల్లించాడు.

"రా,నా రూంకి పోయిమాట్లాడుకుందాం?" పరాంకుశం లిఫ్ట్ దగ్గరకి నడిచాడు. బటన్ నొక్కాడు. ఖాళీ లిఫ్ట్ వచ్చింది. ఇద్దరూ ఎక్కి అయిదో అంతస్థుకి చేరుకున్నారు.

పరాంకుశం బాయ్ చేత పాన్ తెప్పించాడు.

"నిన్న అలా మాట్లాడినందుకు నొచ్చుకోకు. ఫర్ గెటిట్. నిన్న నీ వాలకం చూసి నన్ను ప్లే చేస్తున్నావని అనుమానం వచ్చిందిస్మీ."

"దాని కేంలే....దరిద్రులంటే నాకూ ఎలర్జీయే."

"ఎక్కడ దిగావ్?"

"సిద్ధార్థ."

సిగరెట్లు కాలుస్తూ లోకాభిరామాయణం ముచ్చటించుకున్నారు. "ఏదైనా పనిమీద వచ్చావా?" పరాంకుశం అడిగాడు.

"....మినిస్టరు నా బావ మరది. మధుసూదనం తుప్పలపాడు బ్రిడ్జి తనకిప్పించమని నా ప్రాణం తీస్తున్నాడు. దానికోసం వచ్చాను."

పరాంకుశం రెచ్చిపోయాడు. తను వచ్చిన పని ఆ కాంట్రాక్టు గురించే. అతడికి నమఃశివాయ మీద

గౌరవం అధికమైంది. 'వీడ్ని జాగ్రత్తగా వాడుకోవాలి.'

"మధుసూదనానికి నాలుగైదు కాంట్రాక్టులున్నాయి గదా!"

"వుంటేనేం? డబ్బు లేదా?"

"అది నాకిప్పించకూడదూ?"

నమఃశివాయ ఆలోచించ సాగేడు.

"ప్లీజ్, కాదనకు. దీని గురించే అవస్థపడి వచ్చాను."

"మధుసూదనం ఇరవై ఇస్తానన్నాడు."

"నేను పాతిక ఇస్తాను."

"తీరా నువ్వు అడిగావు, కాదన లేక పోతున్నాను. మధుసూదనానికి ఏదో విధంగా నచ్చచెబుతాలే. సాయంత్రం కాష్ రెడి చెయ్యి."

పరాంకుశం ముఖం వెలిగి పోయింది. "థాంక్స్ బ్రదర్. ఇచ్చి పుచ్చుకోవడమే స్నేహమంటే..." అంటూ అల్మారాలోని స్కాచ్ విస్కీ తీశాడు.

"ఇప్పుడా?" నమఃశివాయ అన్నాడు.

"కాదన కూడదు."

పార్టీ అయిపోగానే నమఃశివాయ వెళ్ళిపోయాడు. పరాంకుశం ఫోన్ చేశాడు. వెంటనే మధుసూదనం పలికాడు.

"నమఃశివాయ కాంట్రాక్టు యిప్పిస్తానన్నాడా?"

"నీకెందుకు?"

పరాంకుశం ఫోన్ పెట్టేశాడు. సాయంత్రం పాతిక వేలు నమఃశివాయ కిచ్చాడు.

* * *

సికింద్రాబాద్‌లో రైలు దిగి నమఃశివాయ బయటకి వచ్చాడు. రిక్షాల వాళ్ళు, ఆటో వాళ్ళు మీద పడ్డారు. నమఃశివాయ రాజధానికి రావడం యిదే తొలిసారి. ఉర్దూ మాటలు తెలియక తెల్లబోతూండగా 'శివం' అన్న పిలుపు వినవచ్చింది.

నమఃశివాయ కారు దగ్గర కెళ్ళాడు. లోపల మధుసూదనం వున్నాడు. డోర్ తెరిచి, 'కారెక్కు' అన్నాడు. బాల్యస్నేహాన్ని గుర్తు పెట్టుకున్నందుకు నమఃశివాయ గర్వించాడు.

మధుసూదనం కుశల ప్రశ్నలు వేశాడు. ఉద్యోగం పోయిందని తెల్సి నొచ్చుకున్నాడు. "మా ఇంట్లో వుండు...ఏదో చూపించి పెడతాలే" అన్నాడు.

పరాంకుశానికి యితడికి ఎంత తేడా?

"రాత్రి రైల్లో పరాంకుశం కనిపించాడ్రా....నన్ను పురుగుని చూసినట్లు చూశాడు. ఎంత విర్రవీగి పోయాడనుకున్నావ్...మానవత్వం లేని మనిషి."

"వాడ్ని నీ కాళ్ళ మీద పడేయ్యనా?"

"ఎలా?"

"చూస్తూండు."

నమఃశివాయకి వేషం మార్చి హోటల్‌లో రూం బుక్ చేశాడు.

పరాంకుశం పాతికవేలు యివ్వగానే మధుసూదనం దగ్గరకెళ్ళి "నువ్వన్నట్లే బోల్తాపడ్డాడు." నమఃశివాయ అన్నాడు.

"డబ్బు డబ్బుని ప్రేమిస్తుంది." మధుసూదనం నవ్వాడు. *


బాధారహిత ప్రకృతిసిద్ధమైన ఆరోగ్యము మీదే!

స్త్రీల బాధలు ప్రత్యేకమైనవి

లోధ్ర

75 సంవత్సరములకు పైగా సుఖజీవనమునకు లోధ్ర టానిక్‌ను వాడిన స్త్రీలు ఎందరో!




ఉచిత వైద్య సలహాకు ఈ క్రింద పేర్కొనబడిన విలాసమునకు ఈ కూపన్‌ను పూర్తిచేసి మీ జాబుతో పంపండి

పేరు: ____________

విలాసము: ____________

____________ PIN ____________

కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్ రాయపేట, మద్రాసు-14

ఏజంట్లు: సీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్ విజయవాడ — సికిందరాబాద్ — బెంగుళూరు